# షరతు

వనజ పార్కులో కూర్చుంది. మాటి మాటికీ చేతి గడియారం చూసుకుంటోంది. మధ్య మధ్య నిట్టూర్పులు విడుస్తోంది.

ఆమెను చూడగానే ముఖంలో ఆదుర్దా భయం కొట్టొచ్చినట్లు కనబడుతున్నాయి. అందులో ఆశ్చర్యమేమీలేదు.

వనజ సూర్యారావును ప్రేమించింది. సంప్రదాయాన్నీ, తలిదండ్రుల్నీ వదిలి అతడితో వెళ్ళిపోయింది. సూర్యారావామెతో మూడు నెలలు కాపురం చేసి మాయమైపోయాడు.

ఉంటున్న ఇంటికి అద్దె ఇవ్వాలి. పాలవాడి బాకీ తీర్చాలి. అన్నింటికీమించి నూరేళ్ళ జీవితం నడపాలి. అందం, వయసు తప్ప మరే ఆధారమూ లేకుండా మిగిలిందామె.

ఆమె ఉంటున్న ఇంటివారబ్బాయి వెంకట్రమణ వనజ పరిస్థితిని తొందరగా అర్థం చేసుకున్నాడు. ఆమెపై జాలిపడి సాయపడబోయాడు. ఇంటి అద్దెకూ, పాలవాడి బాకీ తీర్చడానికీ డబ్బిస్తానన్నాడు. వనజ అతడి సాయాన్ని నిరాకరించింది.

"నా సాయం లేకుండా బాకీలెలా తీరుస్తావు?" అన్నాడతడు.

"ఈ నెలకు నువ్విస్తావు. పై నెల ఎలా? అందామె.

"ఈ బాకీలు తీర్చి ఇంటికి వెళ్ళిపో" అన్నాడతడు.

"ఇదే నా యిల్లు. ఇక్కడే నా కొత్త జీవితం ప్రారంభమవుతుంది. బాకీలు తీర్చడానికి నా మార్గంలో ప్రయత్నిస్తాను. ఎవరికీ ఋణపడడం నా కిష్టముండదు" అందామె.

వెంకట్రమణ మాట్లాడలేదు.

వనజ ఇంటర్మీడియేట్ ప్యాసయింది. టైపు, షార్ట్‌హ్యాండ్ వచ్చు. ప్రయత్నించగా నెల్లాళ్ళు తిరక్కుండా ఓ ప్రయివేటు కంపెనీలో స్టెనో టైపిస్టు ఉద్యోగం దొరికిందామెకు.

వెంకట్రమణ ఆమెనో కంట కనిపెడుతూనే ఉన్నాడు.

ఏడాది గడిచింది.

వనజ ఆ చుట్టుపక్కల చాలా మంచి అమ్మాయిగా పేరు తెచ్చుకుంది. ఆమె మగాళ్ళతో ఎక్కువ మాట్లాడదు. ఆఫీసులో వళ్ళు వంచి పనిచేస్తుంది. తీరిక సమయాల్లో కాంపిటీటివ్ పరీక్షలకు ప్రిపేరవుతోంది. ప్రైవేటుగా బియ్యేక్కడుతోంది. తనకు వచ్చే జీతంతో సుఖంగా రోజులు గడుపుతోంది.

వెంకట్రమణ ఆమె పట్ల ఆకర్షితుడౌతున్నాడు. అతడికా ఊళ్లోనే ఉద్యోగం. నెలకు రెండు వేలు వస్తాయి. తలిదండ్రులతడికి పెళ్ళి సంబంధాలు చూస్తున్నారు. కట్నం పాతిక వేలకు పైనే పలుకుతోంది.

ఆమెతో పెళ్ళి గురించి ప్రత్యక్షంగా ప్రస్తావించలేక పరోక్షంగా పెళ్ళి గురించి ఆమె అభిప్రాయాలడిగాడతడు.

"పెళ్ళంటే అసహ్యం నాకు. నా జీవితాన్ని నేను ఒంటరిగా గడిపేస్తాను." అందామె.

"పెళ్ళి మన సంప్రదాయం. సంప్రదాయాన్ని కాదని సమాజంలో బ్రతకడం కష్టం" అన్నాడు వెంకట్రమణ.

"సంప్రదాయాలన్నీ మగాడి కోసం. ఆడదాన్ని నాలుగు గోడల మధ్య ఉంచడానికే మన సంప్రదాయాలు. నేను సంప్రదాయానికెదురు తిరగాలనుకుంటున్నాను" అందామె.

"అసలు పెళ్ళంటే నీకెందు కసహ్యం?"

"పెళ్ళంటే ఆడది మగాణ్ణి తోడుగా చేసుకోవాలి. మగాడు మోసగాడు. వాణ్ణి నేను తోడుగా భరించలేను." అంది వనజ.

"అంటే విచ్చలవిడిగా తిరగాలనుకుంటున్నావా?" అన్నాడు వెంకట్రమణ.

"నా జీవితం. నా యిష్టం. నన్నడగడానికి నువ్వెవరు?"

"ఆదర్శభావాలుగల ఒక మగాణ్ణి" అన్నాడు వెంకట్రమణ.

"మగాడు అవకాశవాది. వాడికాదర్శాలేమిటి?" అందామె,

"నా ఆదర్శమేమిటో చెప్పనా?" అన్నాడతడు.

"ఊ" అందామె.

"మగాళ్ళంతా మోసగాళ్ళు కారనీ, వాళ్ళలో ప్రేమమూర్తులుంటారనీ నీవు గ్రహించేలా చేయడమే నా ఆదర్శం"

వనజ తెల్లబోయి, "అంటే?" అంది.

"నువ్వొప్పుకుంటే నేను నిన్ను పెళ్ళి చేసుకుంటాను"

"నీవాళ్ళొప్పుకుంటారా?" అప్రయత్నంగా అందామె.

"నీవు నమ్మిన వ్యక్తితో ఏ ఆధారమూ లేకపోయినా ఆడపిల్లవయ్యుండీ అయిన వాళ్ళందర్నీ కాదని వచ్చేశావు. నేను మగాణ్ణి. ఆధారమున్నవాణ్ణి. నీ కోసం నా వాళ్ళందర్నీ వదులుకుంటాను" అన్నాడతడు.

"నన్నాలోచించుకోనీ!" అందామె.

"నీ యిష్టం. నీకోసం ఎంతకాలమైనా ఆగుతాను."

వనజ నెల్లాళ్ళదాకా వెంకట్రమణతో మాట్లాడలేదు. ఆ నెల రోజుల్లో వెంకట్రమణ తలిదండ్రులు తన దగ్గరకు వచ్చి, "మావాణ్ణి వదిలిపెట్టు" అంటారని ఆమె అనుకుంది. అలా జరగలేదు.

ఒక రోజున ఆమె వెంకట్రమణను పలకరించి, "మన విషయం నువ్వు మీ వాళ్ళకు చెప్పలేదా?" అంది.

"చెప్పాను."

ఆశ్చర్యపోయి, "వాళ్ళేమన్నారు?" అంది వనజ.

"ముందు నన్ను తిట్టారు. తర్వాత నిన్ను తిట్టారు. చివరికి ఒప్పుకున్నారు. పెళ్ళి జనార్ధనస్వామి గుడిలో చేయాలన్నారు. ఏదో మ్రొక్కుందట" అన్నాడు వెంకట్రమణ.

వనజలో ఆశ్చర్యంపెరిగింది. "నిజంగా వాళ్ళేమీ అనలేదా?"

"లేదు"

"నేను నమ్మను" అంది వనజ.

"నీకు తెలియదు. అమ్మ, నాన్న కూడా ఆదర్శవాదులు. వారి చేతుల మీదుగా ఎన్నో ఆదర్శ వివాహాలు జరిగాయి. ఆదర్శాలు వల్లించే అందరికి లాగే తమ దాకా వచ్చేసరికి తటపటాయించారు. క్రమంగా అంగీకరించడమేకాక నన్నభినందిస్తున్నారు.."

"ఈ విషయం మీవాళ్ళచేత నాకు చెప్పించగలవా?"

వెంకట్రమణ మాట్లాడలేదు. కానీ మర్నాడు పద్మావతి ఆమెను కలుసుకుని, "మా అబ్బాయి వెంకట్రమణ నిన్ను పెళ్ళి చేసుకుంటానంటున్నాడు. ఈ పెళ్ళి మా కిష్టమే!" అంది.

"ఇలాంటి పెళ్ళికి మీరెందుకు సిద్ధపడుతున్నారు?"అంది వనజ ఆశ్చర్యాన్ని కప్పిపుచ్చుకుని.

"అబ్బాయిష్టపడ్డాడు. వాడిష్టమే మా యిష్టం." అందామె.

"నేనిష్టపడకపోతే మీరు సంతోషిస్తారు కదూ?"

పద్మావతి ఆమె ప్రశ్నకు బదులివ్వకుండా, "వచ్చిన అవకాశాన్ని పాడుచేసుకోకు' ' అని వెళ్ళి పోయింది.

తర్వాత వెంకట్రమణ ఆమెను కలుసుకున్నాడు.

"నేను నిన్ను పెళ్ళి చేసుకుంటాను. కానీ ఒక షరతు. మన పెళ్ళి గుళ్ళో కాదు. రిజిస్ట్రారాఫీసులో జరగాలి" అంది వనజ.

"ఎందుకని?'

"మన పెళ్ళికి నా షరతు అది"

వెంకట్రమణ ముఖం ఎర్రబడింది - "నువ్వు నన్ను నమ్మడం లేదు. గుళ్ళో పెళ్ళి అయితే మోసం చేస్తావనుకుంటున్నావా?"

"కాదు. సంప్రదాయమంటే నాకేర్పడిన అసహ్యం ఇంతా అంతా కాదు. మన పెళ్ళి రిజిస్ట్రారాఫీసులోనే జరగాలి"

"కానీ మా యింట్లో మ్రొక్కుంది"

"మ్రొక్కు కూడా సంప్రదాయమే...సంప్రదాయమంటే నా కసహ్యం.."

ఒక వారం రోజులు గడిచాయి.

వనజ వెంకట్రమణ బదులుకోసం ఆత్రుతగా ఎదురుచూస్తోంది. అతడామెను తప్పించుకుని తిరుగుతున్నాడు. ఒక రోజున ఆమె అతణ్ణి నిలదీసి అడిగింది.

"నీ షరతు మా వాళ్ళకు నచ్చలేదు. సంప్రదాయాన్ని కాదనే వాళ్ళతో పెళ్ళేమిటీ అంటున్నారు..."

"వాళ్ళసంగతి సరే. నీ అభిప్రాయమేమిటి?"

"మన పెళ్ళికి శుభలేఖలు అచ్చువేయిస్తాను. పుర ప్రముఖుల్ని ఆహ్వానిస్తాను. విడీయో తీయిస్తాను. నీకు అన్యాయం జరగదు. నన్ను నమ్ము. గుళ్ళో పెళ్ళికి ఒప్పుకో.." అన్నాడు వెంకట్రమణ.

"పెళ్ళంటూ మనకు జరిగితే రిజిస్ట్రారాఫీసులోనే!"

"మా వాళ్ళయితే సంప్రదాయం నమ్మని పిల్లనింట్లో ఉంచుకోవడం కష్టమంటున్నారు" అన్నాడు వెంకట్రమణ.

మర్నాడే వనజ ఆ యిల్లు ఖాళీ చేసింది.

తర్వాత వెంకట్రమణ ఆమెకు చాలా సార్లు ఫోన్ చేసి షరతును సడలించమని కోరాడు. కుదరదని నిష్కర్షగా చెప్పిందామె.

అలా మూడు మాసాలు గడిచాయి.

ఒక రోజున వెంకట్రమణ ఫోన్ చేసి ఆమెను పార్కుకు రమ్మని కోరాడు. అర్జంటుగా మాట్లాడాలిట!

సాయంత్రం ఆరింటికి.. వనజ పార్కులో కూర్చుంది. అసహనంగా అతడి కోసం ఎదురుచూస్తోంది. అన్న టైముకి పావుగంట ఆలస్యంగా వచ్చేడతడు.

"మా అమ్మ ఆరోగ్యం బాగాలేదు" అన్నాడతడు.

"వైద్యం చేయిస్తున్నారా?" అనడిగిందామె.

వెంకట్రమణ వివరించాడు. కొడుకు పెళ్ళి మ్రొక్కుబడి ప్రకారం జరుగదేమోనని హెచ్చరికగా భగవంతుడు తన ఆరోగ్యం పాడుచేశాడని పద్మావతి నమ్ముతోంది. వైద్యానికామె అంగీకరించడం లేదు.

"సెంటిమెంట్లకు నా షరతు సడలదు" అంది వనజ నవ్వుతూ.

'నీ యిష్టం. అంతా నీ యిష్టప్రకారమే మన పెళ్ళి జరుగుతుంది. ఆ తర్వాత మా అమ్మకేదైనా అయితే ఏ సెంటిమెంటూ నిన్ను బాధించ కూడదని ముందుగా చెబుతున్నాను...' అన్నాడు వెంకట్రమణ.

"నా సంగతి సరే..అలాంటి సెంటిమెంటుతో నువ్వు నన్ను బాధించవుగా?"

"బాధించను.."

"అయితే సరే. రిజిస్ట్రారాఫీసులోనే మన పెళ్ళి!"

ఆ తర్వాత రెండు నెలలకు వాళ్ళ పెళ్ళి జరిగింది..రిజిస్ట్రారాఫీసులో! పెళ్ళయ్యాక ముందుగా ఇంటికి వెళ్ళి అత్తమామలకు పాదాభివందనం చేసింది వనజ.

"ఇదేమిటి? నువ్వు సంప్రదాయం పాటిస్తున్నావు.." అంది పద్మావతి వ్యంగ్యంగా.

"వచ్చిన అవకాశాన్ని పాడుచేసుకోవద్దన్నారు మీరు. ఆ మాటలు నా అహాన్ని దెబ్బతీశాయి. నేను తప్పుచేసిఉండవచ్చు. అంత మాత్రాన ఇతరుల దయాధర్మంపైన ఆధారపడడం నా కిష్టంలేదు. నా షరతు ఒకరిపై అపనమ్మకంతో కాక నా అహాన్ని తృప్తిపర్చుకునేందుకు విధించబడింది. నేను అసహాయస్థితిలో లేననీ, నా పెళ్ళికి షరతులుంటాయనీ మీరు గ్రహించాలి. అప్పుడే నాకు తృప్తి! షరతు లేకుండా కోటీశ్వరుడు పెళ్ళి చేసుకున్నా నాకు తృప్తి ఉండదు. నా షరతు ఆమోదించబడింది కాబట్టి ఇతరులకు తృప్తి కలిగించే ఏ సంప్రదాయమైనా నా కభ్యంతరం లేదు. నేను సంప్రదాయానికి వ్యతిరేకిని కాను" అంది వనజ.

వెంకట్రమణ, పద్మావతి, ఆమె భర్తా వనజ వ్యక్తిత్వానికి ఆశ్చర్యపడుతూ, "ప్రతి యువతీ ఇలాంటి వ్యక్తిత్వాన్ని కలిగుంటే?" అనుకున్నారు.

అది కోరికో లేక భయమో మరి! ★

*(స్వాతి సపరివార పత్రిక - 11-8-89)*